క్లుప్తంగా

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని బోథ్, సొనాల, పొచ్చెర, నేరడిగొండలోని సీసీఐ కేంద్రాల్లో నేటి నుంచి 28వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బోథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 29న కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో ఈనెల 26, 27, 28 వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపి వేస్తున్నట్లు వ్యవసాయ కార్యదర్శి రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు. తిరిగి 29న సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేత



బహుమతి అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ

బేల: మండలంలోని సదల్‌పూర్ గ్రామంలో కుమురంభీం, కుంరం సూరు యూత్ క్రీడ మండలి ఆధ్వర్యంలో ఐదు రోజులుగా కొనసాగిన కబడ్డీ విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఫైనల్‌లో గెలుపొందిన చిత్తగూడ(గాదిగూడ) జట్టుకు ప్రథమ బహుమతి రూ.21వేలు, రన్నరప్ సోనీపోడ్ (మహారాష్ట్ర) జట్టుకు రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన సదల్‌పూర్ జట్టుకు రూ.10వేలను మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డిలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెందూర్ శారద రాందాస్, ఎంపీటీసీ కొడపే అరుణ్, ఉపసర్పంచ్ అరుణ మాధవ్, కొరంగే జంగ్‌షా, ఆడ శంకర్, గావుండే ఘణేశ్యాం, విఠల్ దేవతాళే, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని మంగమఠం శ్రీరమాసత్యనారాయణ స్వామి దేవాలయంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు సామూహికంగా సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వైభవ్ శర్మ దుబే ఆధ్వర్యంలో పలువురు జంటలు ఈవ్రతం ఆచరించి పూజలు చేశారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

కేటీఆర్‌ను కలిసిన ఎంపీపీ

బోథ్: బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు తెలిపారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థి ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న అభినయ్

బోథ్: జిల్లాస్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని కనుగుట్ట గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అభినయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ప్రదర్శనలో ఇంట్లోని వాష్ బేసిన్‌లోని నీరు బయటకు వృథా పోకుండా నీటిని టాయిలెట్ పరిశుభ్రతకు ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేశాడు. దీంతో జిల్లాస్థాయిలో రెండో బహుమతికి ఎంపికయ్యాడు. గురువారం అదనపు కలెక్టర్ రాహుల్ రాజ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. అభినయ్‌ని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, అభినందించారు.

వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి



వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఈశ్వరీబాయి

ఆదిలాబాద్‌రూరల్: ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి అన్నారు. గురువారం మండలంలోని అడ్డగుట్టలో నిర్వహించిన సికిల్‌సెల్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. కొలాం గిరిజనులకు అందిస్తున్న చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సర్ఫారాజ్, వైద్య సిబ్బంది లలిత, మమత పాల్గొన్నారు.

ఘనంగా ఓటరు దినోత్సవం

- ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు
- ఓటుహక్కు ఆవశ్యకతను వివరించిన అధికారులు



ఉట్నూర్‌రూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని అలాంటి ఓటు హక్కును ప్రతీ ఓటరు వినియోగించుకోవాలని మావల ఆర్‌ఐ అమృత్ రావు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్లు గణేష్, వెంకన్న పాల్గొన్నారు.

తలమడుగు: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓటరు నమోదు చేసుకోవాలని నినాదాలు చేశారు. తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో రమకాంత్, ప్రభాకర్, అజయ్, పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్: ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్యాంసుందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ రాజేశ్వరి, ఆర్‌ఐ నితిన్, ప్రధానోపాధ్యాయులు, లస్మన్న పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ ఓటుహక్కును కలిగి ఉండాలని తహసీల్దార్ ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్, పాఠశాలలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ విజయ్ కుమార్, సర్పంచ్ నర్మద, రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ సంతోష్ రెడ్డి అన్నారు. ఓటు ప్రాధాన్యత గురించి వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఆయా గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంట వెంకట రమణ, సర్పంచులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి: ప్రతిఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని తాంసి తహసీల్దార్ లక్ష్మి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భూమయ్య, ఎంఈవో శ్రీకాంత్, సర్పంచ్ కృష్ణ, రాహుల్ రెడ్డి, రాజేశ్, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఓటుహక్కుపై అవగాహన ఉండాలని ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఉట్నూర్ ఐటీఐలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాలనలో మార్పునకు ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ పావని, డీటీ భుజంగ్‌రావు, ఎస్సై మనోహర్, ధరణి రాజేశ్, రాంచందర్, లక్ష్మణ్, తిరుపతి, సుజాత, నవీన్, కిషోర్ పాల్గొన్నారు.



బోథ్: గుర్తింపు కార్డులు అందజేస్తున్న అధికారులు



ఇచ్చోడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నేరడిగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బోథ్: మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎస్సై రాము పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న, ఆర్‌ఐ

ఇచ్చోడ: ఓటుహక్కు వజ్రాయుధం లాంటిందని తహసీల్దార్ తుకారాం అన్నారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బూత్‌లెవల్ అధికారి వద్ద ఓటుహక్కు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు, సర్పంచ్ సునీత, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సిరికొండ: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



జైనథ్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ఇంద్రవెల్లి: అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్



తలమడుగులో..

క్యాలెండర్ ఆవిష్కరణ

నార్నూర్: మండలంలోని తాడీహత్నూర్ ఆశ్రమ పాఠశాలలో తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పెంద్యాల విజయ శేఖర్, శివాజీ, గౌరవ అధ్యక్షుడు మాడవి లక్ష్మణ్‌లు మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలన్నారు. 317 జీవో ద్వారా నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు.

ప్రమాద బీమా ప్రీమియం చెల్లించిన జెడ్పీటీసీ

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన వంద మందికి వ్యవసాయ కులీలకు రూ. 10 లక్షల రూపాయల ప్రమాద బీమా ప్రీమియంను పోస్ట్ ఆఫీస్ అధికారులకు గురువారం జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి అందజేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సొంత డబ్బులతో పోస్ట్‌ఆఫీస్‌లో అకౌంట్ ఓపెన్ చేయించి, రూ. 520 రుపాయలతో బీమా పాలసీ చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్, సర్పంచ్ పోతరెడ్డి, పోస్టర్ అధికారి, విజయ్‌కుమార్, పురుషోత్తం, ఎంపీటీసీ రమేశ్‌రెడ్డి, అశోక్, బాలాజీ, వెంకట్, సాంబశివ్ పాల్గొన్నారు.

నేటి నుంచి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఖానాపూర్: పట్టణంలో హైటెక్ సిటీలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి బ్యాడ్మింటన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల స్థాయి పోటీల్లో, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98868 15272 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వరల్డ్ విజన్ సేవలు అభినందనీయం

లక్ష్మణచాంద: వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని తహసీల్దార్ శ్రీలత పేర్కొన్నారు. గురువారం మండలంలోని మునిపెల్లిలో వరల్డ్ విజన్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 80 పేద కుటుంబాలకు రూ.80 వేల విలువైన చద్దర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ బ్రహ్మన్న, మునిపెల్లి వీడీసీ సభ్యుడు వెంకట్‌రెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మోదీకి మద్దతుగా నిలవాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: యువత ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. నమో నవధాత సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రధాని నరేంద్ర మోదీ కొత్త ఓటర్లుగా నమోదు చేసుకున్న విద్యార్థులతో వర్చువల్‌గా మాట్లాడారు. బీజేవైఎం ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యార్థి కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, విద్యార్థులతో కలిసి వీక్షించారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తరువాత దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బ్రహ్మానంద్, రాళ్ల బండి మహేందర్, శివగౌడ్, మద్నె సురేందర్, నిఖిల్, శేఖర్, బీజేపీ నాయకులు లాలా మున్నా, వేదవ్యాస్, గొర్ల రాము, తదితరులు పాల్గొన్నారు.



మోదీ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

ఆదిలాబాద్‌టౌన్: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆస్పత్రిలో కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం పథకంలో భాగంగా రూ.23.75 కోట్ల వ్యయంతో మంజూరు చేసిన క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఆరోగ్య సేవలు మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం భవనాలను నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటిండెంట్ అశోక్, వైద్యులు తిప్పేస్వామి, ఇంజనీరింగ్ ఈఈ నరసింహారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని కిసాన్‌చౌక్ వద్ద ట్రాఫిక్ కారణంగా వ్యాపారస్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే కిసాన్ చౌక్ పరిసరాలను పరిశీలించారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి అక్కడి పరిస్థితులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రాజేందర్ నాయక్, ఈఈ నర్సయ్య, డీఈ సురేశ్ రాథోడ్, ట్రాఫిక్ సీఐ ప్రణయ్ పాల్గొన్నారు.

ప్రజలందరికీ అండగా ఉంటా



డిజిటల్ పార్క్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్: ప్రజలందరికీ అండగా ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం మాన్కాపూర్‌లో ఏర్పాటుచేసిన డిజిటల్ పార్క్, క్రీడా ప్రాంగణాన్ని ఆమె ప్రారంభించారు. డిజిటల్ పార్క్, క్రీడా ప్రాంగణాన్ని నిర్మించిన సర్పంచ్ రాథోడ్ సావిందర్‌ను ఆమె అభినందించారు. గ్రామంలో ఐక్యత సోదర భావం ఉంటే ఎటువంటి అభివృద్ధి అయినా సాధ్యమవుతుందన్నారు. మాన్కాపూర్ చెరువు కెనాల్‌ను సీసీతో నిర్మించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తానని, బాలికల ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగరావ్, ఎంపీడీవో రమేశ్, రాథోడ్ సునీల్, సర్పంచులు బానోత్ గజానన్‌నాయక్, రాథోడ్ విష్ణు, ఎంపీటీసీ రేణుక దిలీప్ జాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, తదితరులు పాల్గొన్నారు.

హాకీ స్టిక్స్ అందజేత

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని హాకీ క్రీడాకారులకు పట్టణానికి చెందిన వైద్యురాలు సుమలత బుధవారం హాకీ స్టిక్స్ అందజేశారు. ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో వాకింగ్‌కు వెళ్లిన సమయంలో క్రీడాకారులు స్టిక్స్ సరిపడ లేక క్రీడాకారుల ఇబ్బందిని గుర్తించారు. హాకీ కోచ్ సూచనల మేరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ నుంచి ప్రత్యేకంగా హాకీ స్టిక్స్‌ను తెప్పించి, అందజేశారు. ఆమె వెంట తన భర్త డాక్టర్ శ్యాంప్రసాద్, వైద్యుడు ఓంప్రసాద్, హాకీ కోచ్ శ్రీనివాస్ ఉన్నారు.

కార్యదర్శుల సేవలు అభినందనీయం

ఉట్నూర్‌రూరల్: పంచాయతీ కార్యదర్శులు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందుకున్న సందర్భంగా గురువారం పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కార్యదర్శులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మహేశ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

‘రైతులకు ఇబ్బంది కలిగించొద్దు’

ఇచ్చోడ: రైతులకు ఇబ్బంది కలిగించకుండా కందుల కొనుగోళ్లు చేపట్టాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కందుల కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభించారు. ముందస్తుగా గ్రామాల వారీగా ప్రకటించి తేదీలోనే పంటను తీసుకురావాలన్నారు. కొనుగోళ్ల కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాసే విధంగా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, పాండురంగ్, మహిముద్, నర్వడేరమేశ్, సాబీర్, తహసీల్దార్ తుకారాం, డిప్యూటీ తహసీల్దార్ రామారావు, మార్కెట్ కార్యదర్శి రమేశ్, రైతులు పాల్గొన్నారు.

కందుల కొనుగోళ్ల ప్రారంభం

బోథ్: బోథ్ మార్కెట్‌యార్డు పరిధిలో కందుల కొనుగోళ్లను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను శాలువాతో సత్కరించారు. నాణ్యమైన పంటను యార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. దళారుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ సురేందర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న, నాయకులు పాల్గొన్నారు.



కందుల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని పల్సి(బి)తండా గ్రామంలో సంత్ శ్రీనారాయణ బాబా 28వ అఖండ హరినామ యజ్ఞోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మారుమూల గిరిజన గ్రామమైన పల్సి(బి)తండాలో 30 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రమేశ్ రాథోడ్, సర్పంచ్ అంగూర్, ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కిషన్ జాదవ్, మండల కన్వీనర్ తోట వెంకటేశ్, కిరణ్ కుమార్, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోరుబావి, విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు పంపిణీ చేసిన వ్యవసాయ భూముల్లో బోరుబావులు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు కోరారు. గురువారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందజేసే పథకాలలో ఎస్సీ మాదిగ కులస్తులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్, పెంటన్న, రమేశ్, తదితరులు ఉన్నారు.




వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రోడ్డు నిబంధనలు పాటించాలి


తాంసి: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎంవీఐ శ్రీనివాస్‌లు కోరారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లకు, కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత గురించి వివరించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. అతివేగంతో వాహనాలు నడుపకుండా, నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు రామారావు, భిక్షపతి, సంతోష్ రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్, సర్పంచ్ కృష్ణ, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సంతోష్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నేరడిగొండ: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన ఉండాలని కేఎస్ఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ సూర్యనారాయణ, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి రాం మోహన్ రెడ్డిలు అన్నారు. గురువారం నేరడిగొండ పార్కింగ్‌ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం వాహనదారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూనపత్రి వినేష్, పెట్రోలింగ్ సిబ్బంది శివరాజ్, బాలకృష్ణ, భూమన్న పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ అధికారులు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త దిల్షాద్ తండ్రి పాషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న గురువారం వారి నివాసానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కౌన్సిలర్ వందిరి భూమన్న, నాయకులు విజ్జగిరి నారాయణ, కాలనీవాసులు ఉన్నారు.